1) మాంగల్య బలం – శ్రీశ్రీ – 1959

వాడిన పూలే వికసించెనే-చెర
వీడిన హృదయాలే పులకించెనే
తీయని కలలే ఫలియించెనే-ఎల
కోయిల తన గొంతు సవరించెనే
వేయి రేకులు విరిసింది జలజం
తీయ తేనియ కొసరింది భ్రమరం
లోకమే ఒక ఉద్యానవనము
లోటు లేదిక మనదే సుఖము
పగలే జాబిలి ఉదయించనేలా?
పగలే చాలును పరిహాసమేలా?
తేట నీటను నీ నవ్వు మొగమే
తేలియాడెను నెలరేనివలెనే
జీవితాలకు నేడే వసంతం
చెదరిపోవని ప్రేమానుబంధం
ఆలపించిన ఆనందగీతం
ఆలకించగ మధురం మధురం

2) మాంగల్య బలం – శ్రీశ్రీ – 1959

ఆకాశ వీధిలో అందాల జాబిలీ
ఒయ్యారి తారనుచేరి ఉయ్యాలలూగెనే
సయ్యాటలాడెనే ఆకాశవీధిలో

జలతారు మేలిమబ్బు పరదాలువేసి-తెరచాటుచేసి
పలుమారు దాగిదాగి పంతాలుపోయి పందేలువేసి
అందాల చందమామ దొంగాట లాడెనే
దోబూచులాడెనే ఆకాశవీధిలో

జడివాన హోరుగాలి సుడిరేగిరానీ
జడిపించబోనీ
కలకాలము నీవేనని పలుబాసలాడి
చెలిచెంతజేరి అందాల చందమామ

అనురాగం చాటెనే నయగరం చేసెనే ఆకాశవీధిలో

3) వెలుగు నీడలు – శ్రీశ్రీ – 1961

పాడవోయి భారతీయుడా! ఆడి
పాడవోయి భారతీయుడా! పాద

నేడే స్వాతంత్ర్యదినం! వీరుల త్యాగఫలం
నేడే నవోదయం! నీదే ఆనందం పాద

స్వాతంత్ర్యం వచ్చెనని సభలే చేసి
సంబరపడగానే సరిపోదోయి
సాధించినదానికి సంతృప్తినిపొంది
అదే విజయమనుకొంటే పొరబాటోయి
ఆగకోయి భారతీయుడా! కదలి
సాగవోయి ప్రగతిదారులా ఆగకోయి

ఆకశం అందుకొనే ధరలొకవైపు
అదుపులేని నిరుద్యోగ మింకొకవైపు
అవినీతి, బంధుప్రీతి, చీకటిబజారు
అలుముకొన్న నీదేశం ఎటు దిగజారు?
కాంచవోయి నేటి దుస్థితి కాంచవోయి!!

పదవీ వ్యామోహాలు, కులమతభేధాలు
భాషాద్వేషాలు చెలరేగే నేడు
ప్రతిమనిషి మరిమొకని దోచుకొనేవాడే
తన సౌఖ్యం తన భాగ్యం చూచుకొనేవాడే
స్వార్థమే అనర్థకారణం-
అది చంపుకొంటే క్షేమదాయకం స్వార్థమే!!

నవసమాజ నిర్మాణమే నీ ధ్యేయం
సకల జనుల సౌభాగ్యమే నీ లక్ష్యం
ఏక దీక్షతో గమ్యం చేరిననాడే
లోకానికి మన భారతదేశం
అందించునులే శుభసందేశం!

4) వెలుగు నీడలు – శ్రీశ్రీ – 1961

ఓ రంగయో - పూల రంగయో
 ఓరచూపు చాలించి సాగిపోవయో!
పొద్దు వాలిపోతున్నదోయి - ఇంత
 మొద్దునదక నీ కెందుకోయి   ఓ రంగయో

పగలనక రేయనక పడుతున్న శ్రమనంతా
 పరులకొరకు ధారపోయు మూగజీవులు
 ఆటలలో పాటలలో ఆయాసం మరచిపోయి
 ఆనందం పొందగలుగు ధన్యజీవులు   ఓ రంగయో

కడుపారగ కూడులేని తలదాచగ గూడులేని
 ఈ దీనుల జీవితాలు మారుటెన్నడో
 కలవారలు లేనివారి కష్టాలను తీర్చుదారి
 కనిపెట్టి మేలు చేయగలిగినప్పుడే   ఓ రంగయో

5) వెలుగు నీడలు – శ్రీశ్రీ – 1961

కలకానిది విలువైనది బ్రతుకు
 కన్నీటి పాటలలోనే బలిచేయకు   కలకానిది

గాలివీచి పూవులతీగ నేలవాలిపోగా
 జాలివీడి అటులే దాని వదలివైతువా?
చేరదీసి నీరుపోసి చిగురించనీయవా   కలకానిది

అలుముకొన్న చీకటిలోనే అలమటించనేలా?
కలతలకే లొంగిపోయి కలవరించనేలా?
సాహసమను జ్యోతిని చేకొని సాగిపో   కలకానిది

అగాధమౌ జలనిధిలోన ఆణిముత్యమున్నటులే
 శోకాల మరుగునదాగి సుఖమున్నదిలే
 ఏదీ తనంత తానై నీ దరికిరాదు
 శోధించి సాధించాలి - అదియే ధీరగుణం   కలకానిది

6) ఇంటికి దీపం ఇల్లాలే – శ్రీశ్రీ – 1961

వినుము చెలి తెలిపెదనే పరమ రహస్యం
అది మరి యెవరూ తెలియరాని మధుర రహస్యం వినుము

హృదయములూ నయనములూ ఏకమాయెనే
మా యిరువురికీ భేదమింక లేకపోయెనే వినుము

వచ్చెనులే నిల్చెనులే వాకిలిముందు
కాంచితిని కాంచితిని కన్నులవిందు ... ఓ ... ఓ ...
నా జడలో పూవులను తురిమెద నేడే వినుము

అతడే నా పతియనుచు పాట పాడుతా
అతని డెందమున అందముగ నటనమాడుతా ...
వివరముల తెలుపుటకే సమయము కాదా
ఆ విషయముల తీరికగా తెలిపెద నీకూ వినుము

హృదయములూ నయనములూ ఏకమాయెనే
మా యిరువురికీ భేదమింక లేకపోయెనే వినుము

7) భార్యా భర్తలు – శ్రీ శ్రీ – 1961

మధ్రం – మధురం ఈ సమయం
ఇక జీవితమే ఆనందమయం
మధ్రం – మధురం ఈ సమయం!

చల్లని పున్నమి వెన్నెలలో
ఎన్నడు వీడని కౌగిలిలో
కన్నుల వలపు కాంతులు మెరెయగ
కరగిపోయే పెనుచీకటి పొరలు
తొలగిపోయే అనుమానపు తెరలు
పరిమళించే అనురాగపు విరులు
అలరెనే మనసు నందన వనముగ
సఫలమాయే మన తీయని కలలు
జగమునిండే నవజీవన కళలు
పొంగి పొరలే మన కోర్కెల అలలు
భావియే వెలిగే పూవుల బాటగ
మధ్రం – మధురం ఈ సమయం!

8) భార్యా భర్తలు – శ్రీ శ్రీ – 1961

జోరుగా హుషారుగా షికారు పోదమా
హాయి హాయిగా తీయగా జోరుగా

ఓ బాల నీ వయ్యారమెంచి
మరులుకొంటినే
మరువనంటినే జోరుగా

నీ .... వన్నె చిన్నెలన్ని చూసి వలచినాడనే
వయసు సొగసు తలచి తలచి
మురిసినాడనే
కలసిరాగదే జోరుగా

నా .... కలలలోన చెలియ నిన్నే పిలిచినాడనే
కనులు తెరచి ఎదుట నిన్నే
కాంచినాడనే
వరించినాడనే జోరుగా

9) ఆరాధన – శ్రీ శ్రీ – 1962

నా హృదయంలో నిదురించే చెలీ!
కలలలోనే కవ్వించే సఖీ
మయూరివై వయారివై నేడే
నటనమాడి నీవే
నన్ను దోచినావే నా హృదయంలో!!

నీ కన్నులలోన - దాగెనులే వెన్నెలసోన
చకోరమై నిని వరించి
అనుసరించినానే
కలవరించినానే నా హృదయంలో!!

నా గానములో నీవే
ప్రాణముగా పరిమళించినావే
పల్లవిగా పలుకరించరావే

నీ వెచ్చని నీడ - వెలసెను నా వలపుల మేడ
నివాళితో నిను తలంచి
ఎదురుచూచినానే
నిదుర కాచినానే   నా హృదయములో!!

10) పునర్జన్మ – శ్రీ శ్రీ – 1963

ఓ సజీవ శిల్పసుందరీ
నా జీవన రాగమంజరీ
ఎవరివో నీ వెవరివో
ఎవరివో ఎవరివో

నా భావనలో ... నా సాధనలో
నాట్యముచేసే రాణివో?   ఎవరివో

దివినే వదలి భువికేతెంచిన
తేనెల వెన్నెల సోనవో
కవితావేశాము కలలై, అలలై
కురిసిన పూవు వానవో   ఎవరివో

నవవసంతమున నందనవనమున
కోయిల పాడిన పాటవో!
వలపు కొలనులో కలకల విరిసిన
కలువల కన్నుల కాంతివో?

నీ కరకంకణ నిక్వణమా అది
వాణీ వీణానినాదమా?
నీ పద నూపుర నిస్వనమా అది
జలధి తరంగ మ్రిదంగరావమా?
రావే మోహనగీతమా!
రావే నూతన తేజమా!
రావే ... రావే

11) డాక్టరు చక్రవర్తి – శ్రీ శ్రీ – 1964

మనసున మనసై బ్రతుకున బ్రతుకై

తో డొకరుండిన అదే భాగ్యము - అదే స్వర్గము   మన

ఆశలు తీరని ఆవేశములో ఆశయాలలో ఆవేదనలో
నిన్ను నిన్నుగా ప్రేమించుటకు
నీకోసమే కన్నీరు నించుటకు
ఏకాంతములో తోడొకరుండిన
అదే భాగ్యము - అదే స్వర్గము   మన

చెలిమియే కరువై వలపే అరుదై
చెదిరిన హృదయమే శిలయైపోగా
నీవ్యధ తెలిసీ నీడగ నిలిచే
తో డొకరుండిన అదే భాగ్యము - అదే స్వర్గము

నే నున్నానని నిండుగ పలికే
తో డొకరుండిన అదే భాగ్యము - అదే స్వర్గము   మన

12) నర్తనశాల – శ్రీ శ్రీ – 1964

ఎవరికోసం ఈ మందహాసం
ఒక పరి వివరించవే సొగసరీ   ఎవరి

చెలిమికోసం చెలిమందహాసం
ఏమని వివరింతునో గడుసరి!

వలపులు చిలికే వగలాడి చూపు
పిలువక పిలిచీ విరహాలు రేపు

ఎదలో మెదలే చెలికాని రూపు
ఏవో తెలియని భావాల రేపు

ఈ నయగారం - ప్రేమసరాగం
అందించు అందరాని సంబరాలే   ఎవరి

పరుగులుతీసే జవరాలి వయసు
మెరుపై మెరసీ మరపించు మనసు

ప్రణయముచిందే సరసాల చందం

ఇరువురి నొకటిగ పెనవేయూ బంధం

ఈ వయ్యారం - ఈ సింగారం
చిందించు చిన్నిచిన్ని వెన్నెలెన్నో ఎవరి

13) దేవత – శ్రీ శ్రీ – 1965

బ్రతుకంతా బాధగా కలలోని గాధగా
కన్నీటి ధారగా కరిగిపోయె

తలచేది జరుగదూ - జరిగేది తెలియదూ
బొమ్మనుచేసి ప్రాణముపోసి
ఆడేవు నీకిది వేడుకా బొమ్మను

గారడిచేసి గుండెనుకోసీ
నవ్వేవు యీ వింత చాలిక బొమ్మను

అందాలు సృష్టించినావు దయతో నీవు
మరలా నీ చేతితో నీవు తుడిచేవులే
దీపాలు నీవే వెలిగించినావే
గాఢంధకారాన విడిచావులే
కొండంత ఆశ అడియాసచేసి
పాతాలలోకాన త్రోసేవులే బొమ్మను

ఒకనాటి ఉద్యానవనమూ నేడు కనమూ
అదియే మరుభూమిగా నీవు మార్చావులే
అనురాగ మధువూ అందించి నీవు
హాలాహల జ్వాల చేసేవులే
ఆనంద నౌక పయనించువేళ
శోకాల సంద్రాన ముంచేవులే బొమ్మను